ఇదీ ఒక జీవనమేనా మాది? ఆ తీరంనుండి ఈ తీరానికీ, ఈ తీరంనుండి ఆ తీరానికీ లేనిబలం తెచ్చుకొని పోవుటేనా మా దైనికజీవనం? మా యీ జీవనం యెంత హీనం! నాటి యుద్ధాలూ, నాటి పర్యటనాలూ మాకేవీ? నేడుకూడ మా మహత్తు యెక్కడో, యే మూలనో యింకా చెలామణిలో వుంది. కాని నాటి యుగం... నాటి గౌరవం?

మళ్లీ ఆ రోజులు వస్తాయా? నాడు తుపాను మాకు ప్రబలశత్రువై యుండేది. నేడు మీ విజ్ఞానం మాకు తీరని శత్రువైంది. మానవజాతి మా మహత్తును అంగీకరించడం మానేసింది.'

ఒక దీర్ఘనిశ్వాసంతో—'మరి నేడు మా విలువ యింతేకదా! జర్జరరూపంతో, శుష్కదేహంతో ఆ తీరంనుండి ఈ తీరానికీ, ఈ తీరంనుండి ఆ తీరానికీ పచ్చిక మోపులతో, రాయి రప్పలతో...'

గజాధరుడు అప్పుడే దుమికినాడు, 'నాన్నా, నేడు పైసలు అధికంగా లభించినాయి' అంటూ ప్రసన్నవదనంతో పల్లెరాగాలు తీస్తూ నావను నడుపడం మొదలెట్టినాడు.

వృద్ధజగధరుడు తన నిమీలిత నేత్రాలను విప్పినాడు నావ వెడుతూవుంది! అతడు స్వప్నావస్థలో మునిగినాడు. ఛప్-ఛప్-ఛప్ అను శబ్దం మాత్రం అధికమై అతని కల్పనాగీతికకు లయగా మారింది.

(హిందీ మాసపత్రిక 'సరస్వతి' నుండి)

# ఇదీ మన దేశం-

వాడ్రేవు శ్రీజోగిపంతులు

'మీకున్న డబ్బునంతటినీ రెట్టింపు చేయగలను!' అన్నాడు ఆ సాధువు. శాంతమ్మగారి ఎడమచేయి తనకుడిచేత్తో పట్టుకొని, 'అమ్మోయ్! మాతల్లీ! నీకు మాంచి భవిష్యత్తు వుందమ్మా!' చూస్తూ, వేళ్లు లెక్క పెడుతూ అన్నాడు.

'ఒకటిగాని రెండుగాని రూపాయలు ఇవ్వు! నామహిమ నీకిప్పుడే చూపిస్తా!' నన్నాడు.

చూస్తూన్న పళాన రెండు రూపాయలల్లా నాలుగు రూపాయలైపోతాయనే సరికి శాంతమ్మగారు వూరికే వుండలేక పోయింది. గబాగబా లోపలికి పరుగెత్తివెళ్లి రెండు రూపాయలు తీసుకవచ్చింది. ఆ రూపాయలు ఒకచేత్తో పుచ్చుకుంటూ, శుభ్రమయిన గ్లాసుతో మంచినీళ్లు తెమ్మనన్నాడు.

'ఆ నీళ్లన్నీ నాచేతిమీద పొయ్యమ్మా!'

ఆమె పోసింది. అతడు కళ్లుమూసుకుని రెండు నిమిషాలపాటు ఏమేమో గొణగొణలాడాడు శాంతమ్మగార్ని బోల్తా కొట్టించడానికి!

'అయిపోయింది! అయిపోయింది!' అని అరుస్తూ నాలుగురూపాయల బిళ్లలూ ప్రక్కనున్న శాంతమ్మగారి కూతురు వళ్లో పారేశాడు.

'డబ్బుని రెట్టింపుచేయడం ఈతడికి పెద్ద గగనంకాదు' అనుకొంది శాంతమ్మ రూపాయ బిళ్లలు చేత్తో తడివిచూస్తో సంతోషపడుతో. ఆశ్చర్యంగా సాధువు వేపు చూసింది.

'దీనికి నువ్వు ఆశ్చర్యపడక్కర్లేదమ్మా!' అన్నాడు.

శాంతమ్మగారు నోరువిప్పి చెవులు పెద్దవి చేసుకు వింటోంది.

'అది అట్టే పెద్దపనిగాదు! నీదగ్గరున్న డబ్బంతా నాచేతిలో పొయ్యి, నిమిషంలో రెట్టింపు చేస్తా!'

సాధువు చెప్పేకొద్దీ కళ్లు పెద్దవి చేసుకొంటోంది.

'సాయంకాలం మీపిల్లల తండ్రి ఆఫీసునుంచి ఇంటికి వచ్చేసరికి పెట్లోవున్న డబ్బుకి రెట్టింపు చేతుల్లో పోద్దువుగాని!'

సాధువు మాటల్లో గురి కుదిరిందిగాని ఆవున్న రెండువందల రూపాయలుకూడా వారే పెట్లో పెట్టుకుని తాళాలు జేబులో వేసుకపోయారే అని విచారించింది.

సాధువన్నాడు: 'ఒకరిగురించి పని చేసేప్పుడు ఆమెగాని అతడుగాని తప్పించి రెండోవారెవరూ అక్కడ వుండకూడదు. అంతేకాదు, ఈవిషయం వారికిరవంతయినా తెలియకూడదు.అల్లాంటప్పుడు మీపిల్లల తండ్రికి ఈ విషయం చూచాయగా తెలిసినా కష్టం!'

'రేపు రాలేవూ? మావారు పడుకున్నాక రాత్రి పెట్లోనించి డబ్బుతీసి జాగ్రత్త పెడతాను!'

'అలాగే!' అసంతృప్తితో గొణిగాడు.

'ఈ విషయంమట్టుకు మీపిల్లల తండ్రికి ససేమిరా తెలియనివ్వకూడదు సుమా!' 'ఏ మాత్రం తెలిసినా పెట్టెలోవున్న డబ్బంతా బూడిదయిపోతుంది!' శాంతమ్మగారు కొంచెం భయపడ్డది.

'మా వారి కళ్లబడకండా నే చేస్తానుగా!' అంది.

ఇతడు మళ్లా వస్తాడో రాడో?- అని ఆలోచించి,'వుండవోయ్!'తనదగ్గరున్న అయిదురూపాయిల కాగితం అతనికి తెచ్చి ఇచ్చి, 'ఇది రెట్టింపు చేసేయ్!' అన్నది.

'నా మహిమ గురించి ఈమె కేమాత్రం సందేహం కలక్కుండా చేయడానికి మరో ఛాన్సు' అనుకొని వెనకటి మల్లేనే కళ్లుమూసుకుని ఏదో గొణిగి అయిదు రూపాయిల కాగితాన్ని పదిరూపాయిల కాగితంగా మార్చి ఆమె చేతిలో వుంచాడు. ఇట్లా డబ్బుని రెట్టింపు చేయడం అతనికి ఎంతో చిన్న విషయమని ఆమె ఇంకా తెలుసుకోవాలని అతడు ముఖంలో నిర్లక్ష్యత 'చులకన కనబరచాడు. ఈ డబ్బు రెట్టింపుచేసే పద్ధతి దేవుడు ఇతణ్ణి వొక్కణ్ణీ చాటుగా పిల్చి చెప్పాడేమో ననుకుంది ఆమె.

అనవసరంగా ఆమె భర్తకి తెలియనిచ్చి పెట్టెలోవున్న నిక్షేపంలాంటి రెండువందల రూపాయలూ, బూడిదచేసుకోవద్దని మరోసారి హెచ్చరించి ఆ సాధువు వెళ్లిపోయాడు.

* * *

అర్థరాత్రి, శాంతమ్మ భర్త గుర్రుకొడ్తూ నిద్రపోతున్నాడు. తలగడ కిందవున్న తాళాల గుత్తి మెల్లిగాతీసి, కాలివేళ్ల మొనలతో అతి జాగ్రత్తగా పెట్టెదగ్గరకి నడిచి వెళ్ళింది. చప్పుడు రవంతయినా కాకండా మూతతీసింది. చెయ్యి పెట్టెలో పెట్టబోతూవుండగా ఏదోశబ్దం వినబడింది. ఆమె ప్రాణాలు పైనే ఎగిరిపోయి నట్టనిపించింది!—మూత క్రిందికి పడిపోయింది. మరుక్షణంలో - ఆమె వెనుదిరిగి చూసేసరికి, భర్త భయంకంపితురాలైవున్న తనకేసి చూస్తున్నాడు !

తన భర్తకి విషయం తెలిస్తే డబ్బంతా బూడిదవుతుందని తెల్సినప్పటికీ, విషయమంతా భర్తకు చెప్పక తప్పిందికాదు!

ఆమె భర్త ఆమె చెప్పినదంతా అతిజాగ్రత్తగావిని, ఏమీకూడానమ్మనట్టు కనబడ్డాడు.

'ఈపాటి కప్పుడే ఆడబ్బంతా బూడిదయిపోయి వుండొచ్చు' అన్నది శాంతమ్మగారు విచారంగా.

'చూదాం వుండు! బూడిదకాకపోతే ఒక కవరులో పెట్టి సీలుచేసి రెట్టింపు చేయమని రేపా సాధువు కిద్దాం' అని పెట్టెతీసి నోట్లు బయటికి లాగుతూ,

'చూడు! ఇవి నోట్ల కట్టలుగానే వున్నాయి! ఇంకా బూడిదకాలేదు!' అన్నాడు.

'పోయి పడుకో! ఈ డబ్బు కవరు సీలుచేసి నేనూ పడుకుంటాను!' అన్నాడు.

ఆమె సరే నన్నది.

* * *

మధ్యాహ్నం ఆ సాధువు వొచ్చాడు. సంతోషంతో లోపలికి ఆహ్వానించింది. అతడు స్తిమితపడ్డాక సీల్డుకవరు చేతిలో పెట్టి,'ఇందులో రెండువందల రూపాయలున్నాయి!' అన్నది.

'కొంచెం గ్లాసుతో నీళ్లు తీసుకురామ్మా!'

ఆమె నీళ్ళు తెచ్చేలోపల జేబు రుమాలు చుట్టివున్న ఒక మూట పైకి తీసివుంచాడు.

ఆమూట మీద నీళ్ళు పొయ్యమని ఏమేమో కొత్త కొత్త మాటలు గొణిగాడు.

"ఏం అదృష్టవంతురాలి వమ్మా!" అన్నాడు.

శాంతమ్మకళ్ళు మిలమిలా మెరిసినయి.

'ఇది ఎక్కువ డబ్బుకనక రెట్టింపు కావడానికి ఒక గంట సుమారు పట్టుతుంది. అందు చేత వోపికపట్టి ఒక గంటపోయిన తర్వాత విప్పి చూసుకో!' అన్నాడు.

ఇంకాచాలా పనులున్న య్యని చెప్పి ఆ సాధువు వెళ్ళిపోయాడు. దక్షిణఏమేనా తీసికో మని శాంతమ్మగారు బ్రతిమిలాడింది కాని అతడు తనకీ డబ్బుకీ చాలాదూరమని చెప్పి వెళ్ళి పోయాడు.

ఈ తమాషా ఏమిటో చూద్దామని ఆ రోజు ఆఫీసుకి సెలవు పెట్టాడు శాంతమ్మభర్త. సాధువు వెళ్ళి పోగానే అంతవరకు ప్రక్కన దాగివున్న వాడల్లా గుభాల్న బయటికివచ్చి భార్యచేతిలో మూట లాక్కున్నాడు. భర్త చేతిలోంచి మూటను తిరుగాలాక్కుని,

'మనం గంటసేపయినా వుండకపోతే ఎలా?' అని కసురుకుంది.

వీధినపోయేవారంతా కనబడ్డానికిగాను కుర్చీ గుమ్మానికెదురుగ్గా లాక్కుని కూర్చున్నాడు శాంతమ్మ భర్త.

'అక్కడ కూర్చున్నారేం?' అతనిచర్య అర్థంగాక అడిగిందామె.

'ఆవెధవ మళ్ళావచ్చి నాలుగుంపదల రూపాయలూ పట్టుక పోకండా చూడ్డానికి!' అన్నాడు.

గంటఅయినతర్వాత ఒక్క నిమిషం సేపయినా ఆలస్యంచేయకండా శాంతమ్మగారు మూట విప్పిచూసి అలాగే స్తంభానికి జార్లబడి పోయింది! నోటమాటలేదు!

ఆమెభర్త దగ్గరసావచ్చి మూటవేపు తొంగి చూశాడు. ఉత్తచెత్త కాగితమ్ముక్కలు కనపడ్డ వాతనికి!

'ఇదే అనుకుంటూ ఆ వెధవ నీకు కలిగించిన అదృష్టం?' అన్నాడు శాంతమ్మభర్త నవ్వు కొంటూ.

భార్య బుర్ర పైకెత్తి, జేబులోనించి రెండు వందలరూపాయలనోట్లుతీసి, 'పట్టుక వెళ్ళిజాగ్రత్త పెట్టు' అన్నాడు.

జరిగినదంతా భర్త చెప్పేవరకూ శాంతమ్మ గారికేమీ అర్థంకాలేదు.

'దొంగవెధవ! ఏడు రూపాయల్తో వాడి అదృష్టంవాడే చూసుకుందామనుకున్నాడు!'

'వాడు ఏడురూపాయలకోసం మళ్ళా వొస్తాడేమో?'

'ఛస్తేరాడు! ఇక్కణ్ణుంచి పోయిన పావు గంటలోనే జరిగిన మోసం తెలిసికొని వెనక్కి వొస్తే, గుమ్మంలో నన్నుచూసి తోకజాడించి వేశాడు!'


'పాపం! దురదృష్టవంతుడు' అన్నది శాంతమ్మగారు సానుభూతి పూర్వకంగా.

(ఒక ఆంగ్లరచన చదివాక)

---


# ది ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్

హెడ్డాఫీసు : మదరాసు

(Estd:  1907

జారీచేసి చందావేయబడిన

మూలధనం రూ. 72,00,000

అడిగిన మూలధనము. రూ. 53,00,000

రిజర్వ్ ఫండ్ రూ. 62,00,000

అన్నిరకాల బ్యాంకింగ్ వ్యవహారాలు చేయబడును.

యన్. గోపాల అయ్యర్,

కార్యదర్శి.